

ఓదెల: పాత్కపల్లిలో ఎమ్మెల్యేకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# అరవై గ్యారెంటీలిచ్చినా కాంగ్రెస్‌ను నమ్మద్దు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- పాత్కపల్లిలో ఇంటింటా ప్రచారం

ఓదెల, అక్టోబర్ 10: కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు కాదు..అరవై గ్యారెంటీలు ఇచ్చినా నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మూడోసారి కూడా ప్రతిపక్షాలకు భంగపాటు తప్పదని జోస్యం చెప్పారు. మంగళవారం పాత్కపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. గడపగడపకూ వెళ్లి సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని, ఇప్పుడు ఓట్ల కోసం వస్తున్నారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఐరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు ఆళ్ల రాజిరెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకాదేవి, ఎంపీటీసీ రెడ్డి స్వరూప-శ్రీనివాస్, ఆర్‌బీఎస్ గ్రామాధ్యక్షుడు డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆకుల మహేందర్, దాసరి రాజన్న, మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్, కో-ఆప్షన్ ఎండీ సాహెద్ అ లీ, అయిలుకుమార్, రవి, సర్వయ్య, అజారోద్దీ న్, తిరుపతి, సాయిలు, భాను, స్వప్న పాల్గొన్నారు.

# పనిచేసే ప్రభుత్వానికే పట్టంగట్టాలి



ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

- బోర్నపల్లి వంతెన కల నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్‌దే సర్కారుదే
- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- బోర్నపల్లిలో 'మీరు నేను'

రాయికల్, అక్టోబర్ 10: 'గతంలో తెలంగాణ ప్రాంతాన్ని ఎన్నో ప్రభుత్వాలు పాలించాయి. కానీ ఏం చేశాయి. ప్రజల బాధలు ఏనాడైనా పట్టించుకున్నాయా..? కనీస సౌకర్యాలైనా కల్పించాయా..? ఏ ఒక్క పనికాక, సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. మళ్లీ అలాంటి పార్టీలను నమ్ముదామా..? నేనొక్కటే కోరుతున్నా.. పనిచేసే ప్రభుత్వానికే పట్టంగట్టాలి' అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. 'మీరు నేను' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయికల్ మండలం బోర్నపల్లికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వెళ్లారు. వీధుల్లో పర్యటించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మీ గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బోర్నపల్లి ప్రజల చిరకాల కల అయినా వంతెన నిర్మాణం చేయించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని కొనియాడారు. గ్రామంలో ఇప్పటి వరకు రూ.7 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ఆసరా పింఛన్ల ద్వారా 68 మందికి ప్రతి నెలా రూ.1.50లక్షల చొప్పున ఇప్పటివరకు రూ.కోటి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గ్రామంలో 15 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కింద సాయం అందిందన్నారు. 88మంది రైతులకు రైతుబంధు పథకం ద్వారా ఇప్పటివరకు రూ.90 లక్షలు వారి ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. 21 మంది గొల్ల, కుర్మలకు సబ్సిడీ గొర్రెలను అందజేసి కుల వృత్తులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. కాగా, అంతకుముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. ఇక్కడ గ్రామ సర్పంచ్ పాదం లత రాజు, ఎంపీటీసీ సభ్యురాలు ఆత్రం విజయ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాణి, వైస్ ఎంపీపీ మహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి

- ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- 23వ వార్డులో ఇంటింటా ప్రచారం



కోరుట్లలో 23వ వార్డులో యువకునితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

కోరుట్ల రూరల్, అక్టోబర్, 10: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి చెందుతున్నదని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్నదని కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 23వ వార్డులోని ఏస్కోన్‌గుట్ట, అర్బన్ కాలనీల్లోని ఇంటింటా తిరుగుతూ కాలనీ వాసులను ఆప్యాయంగా పలుకరించారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం ఇప్పటికే అభివృద్ధి చెందిందని, తనను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. ప్రతిపక్షాల మాటలు నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు గడ్డమీది పవన్, నాయకులు పుప్పాల ప్రభాకర్, ఎండీ సనావోద్దీన్, చిత్తారి ఆనంద్, మున్నా, జాల వినోద్, అథిక్, నగేష్, గంగాధర్, శ్రీనివాస్ ఉన్నారు.

# పార్టీ గెలుపునకు కృషి చేయండి

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- 'ఖని'లో కార్యకర్తల సమావేశం

గోదావరిఖని, అక్టోబర్ 10: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలనీ, ఈ నెలరోజులు కార్యకర్తలందరూ కష్టపడాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికల్లో రామగుండం ప్రజలు ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్దేశించార. సీఎం కేసీఆర్ సర్కారు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి వివరించాలని సూచించారు. పదేళ్లలో వందేళ్ల ప్రగతి సాధించిన బీఆర్ఎస్‌ను గెలిపించుకోవడం మనందరి ధర్మమని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇన్నాళ్లు పని చేసిందంతా ఒకెత్తయితే ఈ నెలరోజులు పని చేసేది ఒకెత్తన్నారు. నాడు ఉమ్మడి పాలకులు తెలంగాణను ఆగం పట్టించారనీ, సీఎం కేసీఆర్ తెలంగాణను సాధించి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని చెప్పారు. ఇలాంటి పరిస్థితిల్లో మళ్లీ కాంగ్రెస్, బీజేపీ చేతిలో తెలంగాణను పెడితే భవిష్యత్ మళ్లీ అంధకారమే అన్నది ప్రజలకు విడమరిచి చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు కౌశిక హరి, మాదాసు రాంమ్మూర్తి, పీటీ స్వామి, మూల విజయారెడ్డి, బొడ్డు రవీందర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు దసరా ధమాకా

- లక్కీడ్రాలో పది ప్రత్యేక బహుమతులు
- మహిళలు, పురుషులకు వేర్వేరుగా డ్రా
- ఒక్కో బహుమతి విలువ రూ.9900
- వెల్లడించిన ఆర్‌ఎం సుచరిత

తెలంగాణచౌక్, అక్టోబర్ 10 : టీఎస్ ఆర్టీసీ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు ధమాకా ప్రకటించింది. పండుగ రోజుల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక బహుమతులను అందించనుంది. గిఫ్ట్ కూపన్ ద్వారా డ్రా పద్ధతిలో విజేతలను ఎంపిక చేయనుంది. ప్రయాణికులు తమ టికెట్ వెనుకాల చిరునామా, సెల్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లక్కీ బాక్స్‌లో వేయాలి. వీటి కోసం ప్రతి బస్టాండ్‌లో లక్కీ స్కీమ్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు అవగాహన కల్పించాడనికి ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు మళ్లీ 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్ డ్రా బాక్స్‌లో వేయాల్సి ఉటుంది. ఈసారి మహిళలు, పురుషులకు వేరుగా డ్రా తీయనున్నారు. ప్రతి రీజియన్‌లో ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషుల చొప్పున డ్రా పద్ధతిలో ఎంపిక చేసి, బహుమతులు అందజేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 రీజియన్లలో రీజియన్‌కు 10మంది చొప్పున మొత్తం 110 మందిని ఎంపిక చేయనున్నారు. పండుగ ముగిసిన తర్వాత హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు బహుమతులు అందజేయనున్నారు. ఒక్కో బహుమతి విలువ రూ.9900 ఉంటుందని ఆర్‌ఎం సుచరిత తెలిపారు. ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకున్న ప్రయాణికుల కూడా లక్కీ డ్రా స్కీమ్‌లో పాల్గొనవచ్చని సూచించారు.

# ఓటు హక్కు నమోదుకు మరో అవకాశం

**ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చు**

కలెక్టరేట్, అక్టోబర్ 10: జిల్లాలో ఓటు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఈ నెల 31 వరకు గడువు విధిస్తూ దరఖాస్తుకు అవకాశం కల్పించింది. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదుకు ఆరు నెలలుగా విస్తృత ప్రచారం చేపట్టింది. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2023 కింద పలు దఫాలుగా ఓటరు నమోదు కార్యక్రమం కూడా చేపట్టింది. దీంతో, అంచనాకు మించి కొత్తగా ఓటర్లు నమోదు కాగా, ఈనెల 4న ఎస్ఎస్ఆర్ 2023 తుది ఓటరు జాబితాను కూడా ప్రచురించింది. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 10,34,186 మంది ఓటర్లు ఉండగా, ఈ ఏడాది జనవరి 5న విడుదల చేసిన ఓటర్ల జాబితాలో 9,97,143 మంది ఓటర్లు ఉన్నారు. ఎస్ఎస్ఆర్ 23తో అదనంగా 37వేల పైచిలుకు ఓటర్లు కొత్తగా నమోదయ్యారు. అయినా, ఇంకా మిగిలి పోయిన అర్హులైన వారిపై దృష్టి సారిస్తూ, వారిని కూడా ఓటర్ల జాబితాలో చేర్చేందుకు చివరిసారిగా అక్టోబర్ 31 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించగా, దీనిని సద్వినియోగం చేసుకునేలా జిల్లా ఎన్నికల యంత్రాంగం పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతుంది. ఓటరు జాబితాలో చిరునామా మార్పు కోసం వచ్చే ధరఖాస్తులను ఈనెల 9 నుంచే నిలిపివేయగా, ఈనెల 8 వరకు వచ్చిన వాటిని పరిశీలించి నూతన జాబితాలో చేర్చేందుకు జిల్లా ఎన్నికల సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. నగదు తరలింపుకు ముందస్తు అనుమతి తప్పనిసరి : వివిధ అవసరాల నిమిత్తం నగదు తరలించేవారు ముందస్తు అనుమతి తీసుకోవటం అనివార్యం. ఎట్టి పరిస్థితుల్లో కూడా రూ.50 వేలకు మించి ఒక్క రూపాయి కూడా అదనంగా తరలించకూడదనే నిబంధన ఎన్నికల కమిషన్ విధించగా, దీనిని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. నగదు తరలింపు అత్యవసరమైన వారు అవసరమైన పత్రాలతో వెళ్ళాల్సి ఉంటుంది. ఎలాంటి నిర్ధారిత పత్రాలు లేకుండా తరలిస్తే మాత్రం జిల్లా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న తనిఖీ బృందాలు ఆ మొత్తాన్ని సీజ్ చేస్తాయి.